క్లుప్తంగా

వేడుకగా సీతారామలక్ష్మణుల ఊరేగింపు



గంగుండ్ర మండపంలో ఉత్సవర్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీ కోదండరామ ఆలయం నుంచి శ్రీసీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తుల ఊరేగింపు బుధవారం వేడుకగా సాగింది. ఆలయం నుంచి గాంధీ రోడ్డులోని గంగుండ్ర మండపానికి ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. వైకుంఠ ద్వాదశి మరుసటి రోజు ఉభయదారుల కోసం గంగుండ్ర మండపానికి ఉత్సవమూర్తులను వేంచేపు చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి తీర్థకట్ట వీధి మీదుగా ఊరేగించి పూజలు నిర్వహించారు. అనంతరం తిరిగి ఊరేగింపుగా శ్రీకోదండరామాలయానికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్, అర్చకుడు ఆనందకుమార దీక్షితులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులకు విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

చంద్రగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక జమండ్ల వీధిలో బుధవారం నూతన మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ రూపతో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తోందన్నారు. నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు చిన్నారులకు అవసరమైన పోషకాహారం అందించడంతో పాటు వారిలో మేధోశక్తి పెంపొందించేందుకు తగిన విధంగా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. నిత్యం మెనూ ప్రకారం చిన్నారులకు పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందిస్తున్నారని చెప్పారు. అనంతరం చిన్నారులకు పలక, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ దెయ్యాల మాధవరెడ్డి, వీఆర్ఓ భాస్కర్, సూపర్‌వైజర్ నాగమణి, నాయకులు పసల నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్త కుసుమ కుమారి, ముదికుప్పం రామ్మూర్తి, ఒడుగు వెంకటేష్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి భక్తుడి సైకిల్ యాత్ర



చంద్రగిరి: తిరుమల శ్రీవారి భక్తుడు శక్తిదాసన్ సైకిల్ యాత్ర పూర్తి చేసుకుని బుధవారం తిరుగుప్రయాణమయ్యారు. తమిళనాడు, కోయంబత్తూరు జిల్లా కినత్తుకడవుం గరామ్ పాళ్యంకు చెందిన శక్తిదాసన్ (60) తిరుమల శ్రీవారి దర్శనార్థం సుమారు 400 కిలోమీటర్ల దూరం సైకిల్‌పై వచ్చారు. సోమవారం తిరుచానూరులోని శ్రీపద్మావతీ అమ్మవారిని దర్శించుకుని రాత్రి అక్కడే బస చేశారు. మంగళవారం వేకువజామున తిరుమలకు కాలినడకన వెళ్లి స్వామిని దర్శించుకుని రాత్రికి తిరుచానూరు చేరుకుని, బుధవారం ఉదయం ఆయన తిరుగు ప్రయాణమయ్యారు.

మళ్లీ జగనన్నే మా సీఎం

- రుణం తీర్చుకుంటామన్న వృద్ధులు
- ఏ గడపకు వెళ్లినా సంక్షేమ కాంతులే
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ''అడగకుండానే కుటుంబ పెద్దలా, సంక్షేమ పథకాలన్నీ ఇచ్చి మేలు చేశారు.. ఈ ప్రభుత్వం మేలు మరువలేం.. వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించి రుణం తీర్చుకుంటాం.'' అని గిరిపురం, పరసాలవీధి ప్రజలు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి హామీ ఇచ్చారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇన్ని సంక్షేమ పథకాలు ఇచ్చిన దాఖలాలు లేవంటూ మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. తిరుపతి 37వ డివిజన్‌లోని గిరిపురం, పరసాలవీధి ప్రాంతాల్లో కార్పొరేటర్ బసవ గీత, డివిజన్ అధ్యక్షులు కట్టా గోపియాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకునేందుకు గడప గడపకు వెళుతున్న ఎమ్మెల్యే, మేయర్‌కు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఏమి తల్లీ జగనన్న ఇల్లు వచ్చిందా, కాపు నేస్తం వచ్చిందా, వైఎస్సార్ చేయూత పొందావా, సున్నా వడ్డీ రుణాలు తీసుకున్నావా, అమ్మ ఒడి డబ్బు పడిందా అంటూ ఆ వార్డులలోని ప్రజలను ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ఆప్యాయంగా పలకరించారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడూ అందించలేనన్ని సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏ గడపకు వెళ్లినా జగనన్న అందించిన సంక్షేమ పథకాలు పొందిన వారేనన్నారు. జగనన్న అధికారంలో ఉంటే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలసుబ్రమణ్యం, బాలాజీ, బొమ్మగుంట రవి, కోదండ, కట్టా మోహన్, జయలక్ష్మి, మునిరాజ, ఎస్సీ కుమార్, భూపతి, కంకణాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి సేవలు ఆదర్శనీయం

తిరుచానూరు: విద్యాభివృద్ధితో పాటు వర్సిటీ అభివృద్ధికి శ్రీకాంత్‌రెడ్డి అందించిన సేవలు ఆదర్శనీయమని పలువురు వ్యక్తులు కొనియాడారు. ఎస్వీయూ రెక్టార్‌గా పదవీ విరమణ పొందిన ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డికి బుధవారం శ్రీనివాస ఆడిరియంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ అధ్యక్షతన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఎంతో కృషి చేశారని తెలిపారు. సిమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, పద్మావతి యూనివర్సిటీ వీసీ జమున, విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ సుందరవల్లి, కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ వీసీ సాయి గోపాల్ మాట్లాడుతూ శ్రీకాంత్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని, ఆయన సేవలను కొనియాడారు. అనంతరం గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీలు ప్రభాకర్ రావు, రత్నకుమారి, మాజీ రిజిస్ట్రార్లు ప్రతాప్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సత్యవేలురెడ్డి, యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు హనుమంతరావు, ద్వారకనాథరెడ్డి, మధు, పరమగీతం, మాధవి, నిర్వాహకులు డాక్టర్ సుందర్, డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ సిద్దారెడ్డి, డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, నగేష్ పాల్గొన్నారు.



ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డిని సత్కరిస్తున్న వర్సిటీ ప్రొఫెసర్స్

మురుగునీటి శుద్ధి కేంద్రం త్వరలో ప్రారంభం

తిరుపతి తుడా : స్థానిక వినాయకసాగర్ వద్ద నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి పేర్కొన్నారు. ఆమె బుధవారం మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఐదు ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించినట్లు చెప్పారు. ఎగువ ప్రాంతాల నుంచి వినాయకసాగర్‌కు వచ్చే మురుగునీటిని శుద్ధి చేసి సాగర్‌లోకి పంపించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. తిరుపతి స్మార్ట్‌సిటీలో భాగంగా ఈ ప్రాజెక్టును నిర్మించినట్టు చెప్పారు. త్వరలో ఈ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వినాయకసాగర్ అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఫిబ్రవరి కల్లా మొదటిదశ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రీనరీ, ఫుట్‌పాత్, రెయిలింగ్ పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని అ.ధికారులకు సూచించారు. పనులు నత్తనడకన సాగుతుండడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వినాయకసాగర్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

ఘనంగా బ్రెయిలీ జయంతి



లూయిస్ బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న నాయకులు


పాకాల : స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనికి విచ్చేసిన ఎంఈఓ బాబ్జీ మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న పిల్లలకు బ్రెయిలీ లిపిని కనిపెట్టారని తెలిపారు. పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

తిరుపతి గాంధీ రోడ్: నగరంలోని ప్రభుత్వం అంధుల శరణాలయంలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

తెప్పపై శ్రీకామాక్షి

అమ్మవారి కటాక్షం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో చేపడుతున్న తెప్పోత్సవాల్లో నాలుగో రోజు బుధవారం సాయంత్రం శ్రీకామాక్షి అమ్మవారు తెప్పపై భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారి తెప్పోత్సవం వేడుకగా సాగింది. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై అమ్మవారు కొలువై పుష్కరిణిలో ఏడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి,ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) తెప్పపై కొలువైన శ్రీకామాక్షి అమ్మవారు

సీఎంతో హర్షిత్ రెడ్డి



తిరుపతి రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితులకు జైలు

తిరుపతి లీగల్ : నాలుగు వేర్వేరు చోరీ కేసుల్లో ఐదుగురు నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. భక్తుడి జేబులో రూ.2వేలు చోరీ కేసులో కర్ణాటకలోని హాసన్ జిల్లా వేలూరు తాలూకా ఎన్‌నిడిగోడుకు చెందిన ఎస్.హరీష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎస్.హరీష్ బుధవారం నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి అతనికి 240 రోజులు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో నిందితులుగా వున్న మరో ముగ్గురిపై కేసు విచారణ జరగాల్సి వుంది. మరి కొన్ని చోరీ కేసుల్లో షణ్ముగం, వెంకటేశన్, నీలశేఖర్, ఎస్.హరీష్, వి.నట్రాజన్ కు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. రిమాండ్ నుంచి బుధవారం వరకు ఉన్న కాలాన్ని శిక్షాకాలంగా పరిగణించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

28న ఛలో సిద్ధేశ్వరం



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రాయలసీమ అభివృద్ధికి ఈనెల 28న ఛలో సిద్ధేశ్వరానికి ప్రజా ప్రదర్శన చేపడుతున్నట్లు రాయలసీమ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1200 కోట్లతో కేంద్ర ప్రభుత్వం 167 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సిద్ధేశ్వరం-సంగమేశ్వరం వద్ద ఐకానిక్ వంతెనను, బ్రిడ్జికం బ్యారేజ్‌గా నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాయలసీమ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసి సిద్ధేశ్వరం ప్రజాప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి,శ్రీకాంత్‌రెడ్డి,రెడ్డి భాష,శ్రీకాంత్ నాయుడు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో తిప్పారెడ్డి

తిరుచానూరు: ఎస్వీయూలోని శ్రీవారి ఆలయంలో వేంకటేశ్వర స్వామి వారిని అంబేడ్కర్ న్యాయ కళాశాల చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి ఉత్తర ద్వారంలో దర్శించుకున్నారు. ఆయన వెంట శ్రీవారి ఆలయ నిర్మాణ సాధన కమిటీ కన్వీనర్ డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఉన్నారు.

నగర అభివృద్ధే కౌన్సిల్ ప్రధాన అజెండా

తిరుపతి తుడా : తిరుపతి నగర అభివృద్ధే మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ ప్రధాన అజెండా అని, అందుకు అనుగుణంగానే కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళుతోందని నగర మేయర్ డాక్టర్ శిరీష పేర్కొన్నారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్, ముద్రనారాయణ, కమిషనర్ అనుపమ అంజలి, అన్ని విభాగాధిపతులతో ప్రీ-కౌన్సిల్ మీట్‌ను బుధవారం నిర్వహించారు. ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. మేయర్ మాట్లాడుతూ కౌన్సిల్ నిర్ణయాలకు అనుగుణంగా అధికారులు అభివృద్ధి పనులను చేపడుతున్నారని చెప్పారు. చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ తిరుపతి నగర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రోడ్లు ప్రధాన దిక్సూచిగా నిలవనున్నాయన్నారు. యుద్ధ ప్రాతిపదికన మాస్టర్‌ప్లాన్ రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె బాబు, రామస్వామి వెంకటేశ్వర్లు, నరసింహాచారి, ఉమా అజయ్, గణేష్, అదనపు కమిషనర్ సునీత, డిప్యూ టీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎస్ఈ మోహన్, సెక్రటరీ రాధిక, డీసీపీ దేవికుమారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ శిరీష

ఎంబీయూలో వర్క్‌షాపు



చంద్రగిరి: మండల పరిధిలో మోహన్‌బాబు యూనివర్సిటీలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు రీసెర్చ్, ఇన్నోవేషన్ వర్క్‌షాపును ప్రారంభించారు. దీనికి సింగపూర్‌లోని ఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ సుందరరాజన్, మైసూరు జేఎస్ఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ ప్రొఫసర్ డాక్టర్ బీఎస్ మహానంద్ రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఎంబీయూ వీసీ నాగరాజ్ రాంరావు, రిజిస్ట్రార్ సారథి ఇతర డీన్‌లె హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రెండు రోజుల్లో శ్మశాన స్థలం ఏర్పాటు

చంద్రగిరి: మండల పరిధిలోని కల్‌రోడ్డుపల్లిలో పంచాయతీ ఆముదాలకోన ఎస్టీ కాలనీలో రెండు రోజుల్లో శ్మశాన వాటికను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్డీఓ కనక నరసారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఆముదాలకోన ఎస్టీ కాలనీని వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డితో కలసి గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తరతరాలుగా మా గ్రామానికి శ్మశానం లేకపోవడంతో సమీపంలోని అటవీ ప్రాంతంలో దహన క్రియలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. అయితే అటవీశాఖ అధికారులు దహనక్రియలను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 120 కుటుంబాలు జీవనం సాగిస్తున్నప్పటికీ తమకు శ్మశానం లేకపోవడంతో అనేక సార్లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు ఆయన ఎదుట వాపోయారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ తక్షణమే గిరిజనులకు శ్మశానం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరితగతిన సర్వే పూర్తి చేసి గ్రామస్తులకు అనువైన ప్రదేశంలో శ్మశానం కల్పించాలని తెలిపారు. దీనిపై స్పందించిన గ్రామస్తులు ఏళ్ల తరబడి పరిష్కారం కాని శ్మశాన సమస్యపై ఆర్డీఓ స్పందించడం ఆనందంగా ఉందని, ఎమ్మెల్యే చెవిరెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, వీఆర్ఓ వెంకన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

8 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 8 మందికి రూ.9,800 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు 8 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

అర్హతే ప్రామాణికంగా పెన్షన్ల మంజూరు

తిరుపతి తుడా : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నగర మేయర్ డాక్టర్ శిరీష పేర్కొన్నారు. 27వ డివిజన్‌లో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు బుధవారం మేయర్ శిరీష చేతుల మీదుగా అందజేశారు. మేయర్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకోసారి కొత్తగా అర్హత కలిగిన వారికి పింఛన్లను మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ నెల దాదాపు వెయ్యి మంది వరకు అర్హత సాధించి కొత్తగా పింఛన్లను అందుకున్నారన్నారు. అర్హత వుండి ఏ ఒక్కరి పింఛన్‌ను తొలగించలేదని ఆమె గుర్తు చేశారు. ఎప్పటికప్పుడు లబ్ధిదారుల సంఖ్య పెరుగుతూ వస్తుండడానికి ఇదే నిదర్శనమన్నారు. 2019కి ముందు కేవలం 14,192 మందికి మాత్రమే తిరుపతి నగరంలో పింఛన్లు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో పింఛనుదారుల సంఖ్య 19,142కు పెరిగిందని చెప్పారు. ఈ స్థాయిలో లబ్ధిదారుల సంఖ్య పెరిగి ఉంటే కొందరు పనిగట్టుకుని తొలగించారంటూ అభాండాలు వేస్తున్నారన్నారు. ఇలాంటి ప్రచారాన్ని ప్రజలెవ్వరూ నమ్మవద్దన్నారు. పింఛన్ వారోత్సవాల్లో భాగంగా ఏడో తేదీ వరకు కొత్త పింఛన్‌ను నగర వ్యాప్తంగా అందజేస్తున్నట్టు చెప్పారు.





చంద్రగిరిలో వృద్ధులకు మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, తిరుపతి 11వ డివిజన్‌లో కొత్త పెన్షన్లను అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి తదితరులు

వృద్ధాప్యంలో ఆదుకుంటున్న దేవుడు

తిరుపతి మంగళం: మందులు, మాత్రలకు చిల్లిగవ్వ లేకుండా ఇంట్లో వాళ్లను అడగలేక, బతుకు భారమై జీవిస్తున్న వృద్ధులకు రూ. 2750 పెన్షన్ ఇచ్చి ఆదుకుంటున్న దేవుడు సీఎం జగన్ అంటూ పింఛనుదారులు చేతులెత్తి మొక్కుతున్నారు. తిరుపతి నగరంలోని ఒక 11వ డివిజన్‌లో 43మందికి కొత్త పెన్షన్లను కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి, డివిజన్ అధ్యక్షులు దొడ్డారెడ్డి మురళీరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డారెడ్డి మునికృష్ణారెడ్డి, వెంకటముని, సుధాకర్ బాబు, మురళీయాదవ్ పాల్గొన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ పండుగలా సాగుతోంది. జనవరి 1న తెల్లవారు జాము నుంచే పింఛన్ లబ్ధిదారుల ఇళ్ల వద్ద సందడి నెలకొంది. చంద్రగిరి నియోజకవర్గం పాకాల, చంద్రగిరి మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు, తిరుపతి రూరల్ మండల పరిషత్ అధ్యక్షులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పెరిగిన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న పింఛన్లు క్రమంగా పెంపుదల చేస్తూ అవ్వా, తాతలపై తనకున్న ప్రేమను చాటుకున్నట్లు తెలిపారు. చంద్రగిరిలో పెరిగిన పింఛన్లను తీసుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

కొత్తగా మంజూరైన 229 పెన్షన్లు

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పెన్షన్లు మంజూరు చేస్తోందని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పెన్షన్‌ను బుధవారం మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి అన్ని పథకాలను పూర్తి చేశారని, అన్ని రకాల ప్రజలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు. మండలంలోని కొత్తగా 105 వృద్ధాప్య, 67 వితంతు, 54 దివ్యాంగ, 2 డప్పు కళాకారులు, 1 ఒంటరి మహిళకు మొత్తం 229 కొత్త పెన్షన్లు మంజూరు చేసిందని తెలిపారు. మొత్తం 8,641 మందికి ప్రతి నెలా పింఛన్ అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, నాయకులు నంగా బాబు రెడ్డి, నంగా నరేష్‌రెడ్డి, వల్లివేడు విక్రమ్‌రెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, మునీర్, పట్టాభిరెడ్డి, సర్పంచులు కస్తూరి, కళావతి, సునీత, ఎంపీటీసీ మల్లికార్జున, ఎంపీడీఓ రమేష్‌బాబు, ఈఓపీఆర్డీ మాలతి పాల్గొన్నారు.

పథకాలు ఇవ్వడమే ప్రభుత్వ విధానం

భాకరాపేట : పథకాలు ఇచ్చుకుంటూ పోవడమే మా ప్రభుత్వ విధానం అని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అవ్వాతాతల కళ్లల్లో ఆనందం కనబడుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా సాయం చేసే పెద్ద మనసు ఉన్న ప్రభుత్వాన్ని మనం చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ స్వరూప, ఎంపీడీవో దేవేంద్రబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, పింఛన్ లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది, మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షులు, పంచాయతీ కన్వీనర్లు పాల్గొన్నారు.